క్లుప్తంగా

బొత్స ఝాన్సీకి అభినందనలు



బొత్స ఝాన్సీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న 33వ వార్డు నాయకులు, కార్యకర్తలు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీని శుక్రవారం పార్టీ 33వ వార్డు నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. బోదిలపాటి ఉమామహేశ్వరరావు, మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, కణితి బ్రహ్మం, పిల్లి శివ, కొడమంచిలి శ్రీను, నొల్లి పోతుస్వామి తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకలకు శ్రీకారం



దుర్గాలమ్మకు హారతి సమర్పిస్తున్న వాసుపల్లి

అల్లిపురం: పూర్ణామార్కెట్‌లో కొలువుదీరిన శ్రీ దుర్గాలమ్మ శివరాత్రి పండగ రాట మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి వాసుపల్లి గణేష్‌కుమార్ ఉత్సవ రాట రాటకు పూజలు చేసి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో శేఖర్ బాబు ఆధ్వర్యంలో ఆలయాన్ని విశేషంగా అలంకరించారు. వాసుపల్లి మాట్లాడుతూ శివరాత్రి మహా పర్వదినం సందర్భంగా రుద్రాభిషేకాలు, రోజుకొక అవతారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారని తెలిపారు. కార్యక్రమంలో 35వ వార్డు నాయకులు అలుపున కనకరెడ్డి, ఆదివిష్ణురెడ్డి, వాసుపల్లి సుబ్రహ్మణ్యం, మల్లా వెంకట విజయ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాట ఉత్సవం



రాట వేస్తున్న కనకరెడ్డి, భక్తులు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులోని చిన దుర్గాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కనకరెడ్డి రాట ఉత్సవం నిర్వహించారు. వార్డులో ఈ నెల 8న జరిగే మహా శివరాత్రిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎనిమిది రోజులు పాటు ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బంగారు శెట్టి తెలిపారు. సుబ్రహ్మణ్యం, పుష్ప, రమణమ్మ, గండిబోయిన రమణ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతో మెరుగైన అవకాశాలు

ఏయూ క్యాంపస్: విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని, అప్పుడు మెరుగైన ఉపాధి అవకాశాలు సాధ్యమవుతాయని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో నిర్వహించిన యాంత్రిక 2కే24 సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మార్కులు అవసరమే కానీ.. అవే ప్రధానం కాదన్నారు. నైపుణ్యాలు, ప్రత్యేక సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఏఐ, బ్లాక్‌చైన్, ఎంఐ, ఐవోటీ, ఇండస్ట్రీ 4.0 వంటి సాంకేతికతలను అన్ని శాస్త్రాలతో మిళితం చేస్తూ ఉపయుక్తంగా నిలుపుకోవాలని సూచించారు. శాస్త్ర అంశాలను నేర్చుకోవడంతో పాటు వాటిని నిత్య జీవితంలో అన్వయించడం ఎంతో అవసరమన్నారు. నూతనంగా అభివృద్ధి చెందుతున్న శాస్త్రాలను, సాంకేతికతను యువతకు అలవాటు చేస్తూ వారిని భవిష్యత్తుకు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారన్నారు. ఎడ్‌ఎక్స్‌తో ఏపీ ప్రభుత్వం చేసుకున్న ఎంవోయూలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో భాగంగా సదస్సు సంచికను ఆవిష్కరించారు.

సమస్యలు చెప్పండి.. పరిష్కరిస్తాం



జామియా మసీదు వద్ద వినతిపత్రం తీసుకుంటున్న వాసుపల్లి



34వ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న వాసుపల్లి గణేష్‌కుమార్

- ‘ప్రజాదర్బార్’లో వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: ప్రజలు తమ సమస్యలు చెబితే.. వాటిని తక్షణం పరిష్కరించి అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి వాసుపల్లి గణేష్‌కుమార్ హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం 30, 36, 37 వార్డుల పరిధి ఏవీఎన్ కళాశాల దరి జామియా మసీదు వద్ద.. 32, 33, 34 వార్డులకు సంబంధించి అచ్చియ్యమ్మపేట వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమాలకు విశేష స్పందన లభించింది. రెల్లి వీధి జంక్షన్ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపాన్ని ఐదు రెల్లి వీధిలకు చెందిన గౌతంబాబా సేవా సంఘానికి మెయింటినెన్స్‌కు ఇవ్వాలని వాసుపల్లికి కులపెద్దలు అభ్యర్థించారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలను స్వీకరించి అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.

- 34వ వార్డు అచ్చియ్యమ్మపేటలో జరిగిన ప్రజా దర్బార్‌లో వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వాటిపై అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, పార్టీ మండల అధ్యక్షులు, స్టేట్ డైరెక్టర్లు, జిల్లా సీనియర్ నాయకులు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

6న ఘాట్ రోడ్డు పనుల ప్రారంభం



ఇసుక కొండ ఆలయ ఘాట్ రోడ్డును పరిశీలిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: ఈ నెల 6న ఇసుకకొండ సత్యనారాయణ స్వామి ఆలయ ఘాట్ రోడ్డు పనులను ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఘాట్ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో దక్షిణ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కలసి కోరినట్లు చెప్పారు. ఎంతో ప్రసిద్ధి గాంచిన సత్యనారాయణ స్వామి ఆలయానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహర్దశ పట్టిందన్నారు. సుమారు రూ.11 కోట్లతో కిలో మీటర్ పొడవున నిర్మిస్తున్న ఘాట్ రోడ్డు అందుబాటులోకి వస్తే భక్తులు పూర్ణా మార్కెట్ నుంచి నేరుగా ఆలయానికి చేరుకోవచ్చని చెప్పారు. ప్రతిపక్షాల నుంచి ఎన్ని అడ్డంకులు ఎదురైనా వక్ఫ్ బోర్డు స్థలానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించి టీడీఆర్ ఇచ్చి సమస్యను పరిష్కరించామన్నారు.

ఏఎంసీలో కడావర్ ట్యాంక్ ప్రారంభం



కడావర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ అనాటమీ విభాగంలో నూతనంగా నిర్మించిన కెడావర్ ట్యాంక్‌ను శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ ట్యాంక్ నిర్మాణానికి ఏఎంసీ 1987 బ్యాచ్ విద్యార్థి డాక్టర్ కె.ధనుంజయనాయుడు రూ.60 వేల విరాళంగా ప్రకటించారు. అనాటమీ సహాయ ఆచార్యులు డాక్టర్ హేమరాధిక ప్రత్యేక పర్యవేక్షణలో అనాటమీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రవీంద్ర కిషోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సావిత్రిబాయి పూలే ట్రస్టు, జ్యోతీబసు దేహదాన ప్రోత్సాహక సంస్థల ద్వారా అందజేయనున్న కడావర్ల(మృతదేహాలు)ను భద్రపరచడానికి, నిల్వ చేయడానికి ఈ ట్యాంక్ ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ బుచ్చిరాజు తెలిపారు. మృతదేహాలను నిల్వ చేయడం ద్వారా వైద్య విద్యార్థులకు శరీర నిర్మాణ శాస్త్రాన్ని మరింత మెరుగ్గా బోధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అనాటమీ విభాగ ఆచార్యులు డాక్టర్ డి.రాధిక, సహాయ ఆచార్యులు డాక్టర్ బంగారయ్య, డాక్టర్ సురేఖ, డాక్టర్ విశ్వశాంతి, డాక్టర్ సునీత, డాక్టర్ నీరజ, డాక్టర్ సునీత, డాక్టర్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న కొల్లి సింహాచలం

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డులో శుక్రవారం మేము సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. వార్డు ఇన్‌చార్జ్ కొల్లి సింహాచలం అధ్యక్షతన లక్ష్మీటాకీస్ వద్ద 36, 38, 39 వార్డుల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యంత మెజారిటీతో గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఒక్కొక్క బూత్‌కు ఇన్‌చార్జితోపాటు ముగ్గురు వైస్ ప్రెసిడెంట్లు, ఇద్దరు గృహసారథులు ఉంటారన్నారు. వీరందరూ సమన్వయంతో పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో వార్డుల ముఖ్య నేతలు, బూత్ ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలి



సంఘీభావం తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని మహారాజాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(మిమ్స్)లో పనిచేస్తున్న 350 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 30 రోజులుగా పోరాడుతున్నారు. వారికి సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ సంఘీభావం తెలిపింది. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ మిమ్స్ ఉద్యోగులు వేతన ఒప్పందంపై నోటీస్ ఇచ్చి సమ్మెలోకి వెళ్లేలోపు కోవిడ్ రావడంతో ప్రజలకు ఇబ్బంది రాకుండా ఉండేందుకు సమ్మె విరమించారని గుర్తు చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, బకాయి డీఏలను వెంటనే చెల్లించాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.జగన్, ఎం.సుబ్బారావు, జి.అప్పలరాజు, వై.రాజు, వి.కృష్ణారావు, చంద్రమౌళి, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

సీతమ్మధార: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని సందేశ్ ఖాళీలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై స్పందించని మమతా బెనర్జీ ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ బీజేపీ విశాఖ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాతరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథ్‌రాజు, సుజాతరాజ్ మాట్లాడుతూ సందేశ్ ఖాళీలో టీఎంసీ ఎమ్మెల్యే షాజహాన్ షేక్ మహిళలపై అకృత్యాలు, బలవంతంగా ప్రజల భూములను లాక్కోవడం వంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి ఒక మహిళై ఉండి.. ఆ ఎమ్మెల్యేపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. దుర్మార్గమైన రాజకీయాలు చేస్తున్న మమతా బెనర్జీ ప్రభుత్వం గద్దె దిగాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి, నాయకులు ఎస్.వి.ఎస్.ప్రకాష్‌రెడ్డి, వి.రోహిణి పాల్గొన్నారు.

3, 4 తేదీల్లో ‘ఐడియల్ గాంధర్వ’

ఏయూ క్యాంపస్: అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నగరంలో ఈ నెల 3, 4 తేదీల్లో ఐడియల్ గాంధర్వ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఘంటసాల స్వర పరిశోధకుడు టి.శరత్‌చంద్ర తెలిపారు. శుక్రవారం లాసన్స్‌బే కాలనీలోని అసంగానంద ఆశ్రమంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వర్ధమాన గాయకులను ఎంపిక చేసి ప్రముఖ గాయకులతో శిక్షణ ఇచ్చి భవిష్యత్ తరాలకు ఘంటసాల పాటలు, స్వరపరిచిన గీతాలు, పద్యాలు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.

పిల్లలకు పోలియో చుక్కలు వేయించండి

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి–2లోని యూపీహెచ్‌సీ పరిధిలో గల ఏడు కేంద్రాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు యూపీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ శ్రావణి తెలిపారు. హిందు, ముస్లిం కాలనీ సచివాలయం, ఆశీలమెట్ట అంగన్‌వాడీ సెంటర్, అమర్‌నగర్ సచివాలయం, శ్రీనగర్, భగత్‌సింగ్ నగర్ సచివాలయం, ఇషఖా నగర్ సచివాలయం, దొండపర్తి –2 సచివాలయం, చుక్కవారి వీధి దొండపర్తి యూపీహెచ్‌సీ సెంటర్లలో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేస్తున్నట్లు చెప్పారు. ఆశా వర్కర్లు అందుబాటులో ఉంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘ఎంఎస్ఎంఈ సర్వే’ బ్యానర్ ఆవిష్కరణ



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: ఎంఎస్ఎంఈ సర్వే అండ్ సపోర్ట్ కార్యక్రమ బ్యానర్‌ను శుక్రవారం జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే కోసం మొబైల్ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అమెనిటీ సెక్రటరీలు ఈ సర్వేను ఈ నెల 1 నుంచి 20 వరకు నిర్వహిస్తారని చెప్పారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ల ద్వారా ఈ సర్వే పురోగతిని జిల్లా పరిశ్రమల కేంద్రం కలెక్టర్ ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తుందని జేసీ వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సిహెచ్.గణపతి, డీఎల్‌డీవో ఆర్.పూర్ణిమాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు



చంద్రమౌళిని అభినందిస్తున్న ఈశ్వరరావు

అల్లిపురం: వీఎంఆర్‌డీఏ నూతన చైర్మన్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన సనపల చంద్రమౌళిని నూతన్ సేవా ట్రస్ట్ చైర్మన్ సతివాడ ఈశ్వరరావు, సతివాడ యశోద అరుణ్‌రాజులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. సతీష్, మనోజ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గొడవలో ఒకరికి గాయాలు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇరుగుపొరుగు వారు గొడవ పడటంతో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివసిస్తున్న జి.దుర్గారావుకు ఇరుగుపొరుగున నివసించే వారికి గొడవ జరిగింది. మాటా మాటా పెరగడంతో దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో దుర్గారావుకు గాయాలయ్యాయి. వెంటనే అతడిని కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. అతడి భార్య జి.ప్రమీల గురువారం రాత్రి ఫిర్యాదు చేయడంతో సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

బుల్లయ్య కాలేజీ విద్యార్థుల సైకిల్ రైడ్



సైకిల్ రైడ్‌ను ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాల్లో భాగంగా శుక్రవారం కాలేజీ విద్యార్థులు సైకిల్స్‌పై ప్రయాణించి ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించారు. కళాశాల నుంచి ప్రారంభమైన సైక్లింగ్ రైడ్ జగదాంబ, కలెక్టర్ ఆఫీస్, బీచ్ రోడ్, వీఎంఆర్‌డీఏ పార్క్, ఏయూ, సీఎంఆర్ జంక్షన్ వరకు సుమారు 8.5 కిలో మీటర్ల మేర నిర్వహించారు. ఈ రైడ్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.మధుకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం శారీరక వ్యాయామాలు చేయడం, సైకిల్ తొక్కడం ద్వారా ఫిట్‌నెస్ స్థాయిలను మెరుగుపర్చుకోవాలని సూచించారు.

సీఎం జగన్‌తోనే నిజమైన అభివృద్ధి



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్, తోట పద్మావతి

అల్లిపురం: నూతన విద్యా విధానం ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్ అందివ్వడమే నిజమైన అభివృద్ధి అని వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో కొబ్బరితోటలో రూ.18.50 లక్షలతో నిర్మించిన వాడబలిజ సేవా సంఘం సామాజిక భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచంతో పోటీపడే విద్యను ప్రభుత్వ పాఠశాలలో పేదలకు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐడియాలజీకి సెల్యూట్ చేస్తున్నానన్నారు. విద్య, వైద్యం పేదలకు ఉచితంగా అందినప్పుడే నిజమైన అభివృద్ధి జరుగుతుందని నమ్మిన వ్యక్తి జగన్ అని పేర్కొన్నారు. ఇటువంటి దార్శనికత కలిగిన వైఎస్ జగన్ మరో 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాడబలిజ సేవా సంఘం అధ్యక్షులు దాసరి ఎల్లయ్య, చిన్న దానయ్య, ఎల్లారావు, కొండబాబు, వార్డు సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, తాతబ్బాయి, రవి తదితరులు పాల్గొన్నారు.

వాసుపల్లి చొరవతో నిలిచిన బార్ అండ్ రెస్టారెంట్

- రెల్లి కుల సంక్షేమ సంఘం హర్షం



ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చిన వాసుపల్లి

అల్లిపురం: జీవీఎంసీ 30, 36, 37 వార్డుల పరిధి రెల్లివీధి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపం ఎదురుగా కొత్తగా ఏర్పాటు చేస్తున్న బార్ అండ్ రెస్టారెంట్‌ను నిలపాలని స్థానికులు పలుమార్లు వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన గురువారం సాయంత్రం ఆశీలమెట్టలోని తన కార్యాలయంలో ఇరువర్గాలను సమావేశ పరిచారు. అక్కడ బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేస్తే బడుగు, బలహీన వర్గాల ప్రజలతోపాటు స్కూల్, కాలేజీల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడతారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అభీష్టం మేరకు ఉదారతతో ఆలోచించి బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని వాసుపల్లి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బార్ యాజమాన్యం అంగీకరించడంతో రెల్లి కుల సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, వార్డ్ ప్రెసిడెంట్ దళమంతుల మాణిక్యాలరావు, సీనియర్ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, చిన్ని, కోన శ్రీనివాస్, అశోక్, రెల్లికుల సంఘం పెద్దలు పాల్గొన్నారు.

3న ‘పీవీపై నాలుగు మంచిమాటలు’

మహారాణిపేట: దివంగత ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించిన శుభ సందర్భంగా వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 3న నగరంలోని ఒక హోటల్‌లో నాలుగు మంచిమాటలు అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ కన్వీనర్ పి.వి.నారాయణ తెలిపారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సుప్రీంకోర్టు డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాది రామకృష్ణ, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు, సెంచూరియన్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జీఎస్ఎన్ రాజు, పీవీ మనుమడు ఎన్.వి.సుభాష్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్, సీనియర్ న్యాయవాది కె.వి.రామ్మూర్తి, ఏయూ రిటైర్డ్ రెక్టార్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, విశ్రాంత అడిషనల్ ఎస్పీ టీఎస్ఆర్ ప్రసాద్, కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, రాజకీయ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. పీవీ నరసింహారావు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నారాయణ కోరారు.

ముస్లింలకు టికెట్ ఇచ్చే పార్టీనే గెలిపించుకుంటాం



జగదాంబ దరి మక్కా మసీదు వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు

అల్లిపురం: ప్రధాన రాజకీయ పార్టీలు ఒక అసెంబ్లీ నియోజకవర్గ స్థానాన్నైనా ముస్లింలకు కేటాయించాలని మక్కా మసీదు అధ్యక్షుడు షేక్ మున్నీర్ కోరారు. విశాఖపట్నం ఎంపీగా పోటీ చేయడానికి ముస్లింలు కూడా అర్హులేనన్నారు. జగదాంబ కూడలి వద్ద గల మక్కా మసీదు ఎదుట శుక్రవారం జుమా నమాజ్ అనంతరం మున్నీరు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో 34 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయన్నారు. జిల్లా జనాభాలో ముస్లింలు రెండో స్థానంలో ఉన్నాసరే చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లేదని విచారం వ్యక్తం చేశారు. ముస్లింల సమస్యల పరిష్కారం కోసం చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 3 లక్షల 50 వేల మంది ముస్లిం జనాభా ఉందని తెలిపారు. దక్షిణ నియోజకవర్గంలో 25 వేల ముస్లిం ఓటర్లు ఉన్నారన్నారు. నగరంలో 120 మసీదులు ఉన్నాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ముస్లింలకు టికెట్ ఇచ్చే పార్టీనే గెలిపిస్తామన్నారు. మక్కా మసీదు జాయింట్ సెక్రటరీ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ ముస్లిం సమస్యల పరిష్కారం కోసం ప్రధాన పార్టీలు ముస్లింలకు ఎమ్మెల్యే సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులకు చర్యలు

విశాఖ సిటీ: జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నామని ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వివరించారు. ఎన్నికల అధికారి విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. విశాఖ నుంచి కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఈఆర్వోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున జిల్లాలో చేపట్టిన చర్యలను వివరించారు. వికలాంగుల సౌకర్యార్థం ర్యాంపులు వేశామని, ఇతర వసతులు కల్పించామని వెల్లడించారు. ఓటర్లకు తాగునీరు, పోలింగ్ కేంద్రాల్లో కాంతి బాగా ఉండేలా విద్యుత్ సంబంధిత సౌకర్యాలు కల్పించామన్నారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామని, అన్ని రకాలుగా సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు. అన్ని స్థాయిల్లో అవసరమైన సిబ్బంది కేటాయింపులు జరిగాయని చెప్పారు.

ట్రయథ్లాన్‌లో ప్రతిభ

సీతంపేట: ఇండియన్ నేవీ సర్వీసెస్ వారిచే ఇటీవల లోనవాలలో జాతీయ స్థాయిలో నిర్వహించిన ట్రయథ్లాన్ పోటీలో లంకపల్లి బుల్లయ్య కళాశాల బీఎస్సీ థర్డ్ ఇయర్ విద్యార్థి కె.వంశీకిరణ్ ప్రతిభ చూపి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ వంశీకిరణ్‌ను అభినందించారు.

హలీం సెంటర్ ఏర్పాటు



సరస్వతి పార్కు వద్ద హలీం సెంటర్‌ను ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

అల్లిపురం: రంజాన్ మాసం ప్రారంభమవుతున్న సందర్భంగా నగరంలో హలీం సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. సరస్వతి పార్కు వద్ద లజీజ్ పిస్తా హలీం సెంటర్‌ను శుక్రవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి వాసుపల్లి గణేష్‌కుమార్, విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీలు ప్రారంభించారు. వాసుపల్లి మాట్లాడుతూ హైదరాబాద్ రుచి అందించగలిగే లజీజ్ హలీం పిస్తా పాయింట్‌ను తొలిసారిగా విశాఖలో ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో 34, 33 వార్డుల కార్పొరేటర్లు తోట పద్మావతి, భీశెట్టి వసంతలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు అలుపున కనకరెడ్డి, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.